

23న పిల్లలకు ఉచిత గుండె వైద్య శిబిరం

ప్రజాశక్తి - భీమవరం

పిల్లల గుండె సంబంధిత వ్యాధులకు సంబంధించి ఉచిత వైద్య శిబిరాన్ని ఈ నెల 23వ తేదీ మంగళవారం సాయంత్రం మెంటేవారితోటలోని అల్లూరి సీతారామరాజు, భగత్‌సింగ్ వైద్య సహాయ కేంద్రం (సుందరయ్య భవనం)లో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు వి.రాధాకృష్ణ, వసుధ ఫౌండేషన్ కన్వీనర్ ఇందుకూరి ప్రసాదరాజు తెలిపారు. ఈ మేరకు ఆదివారం వారు ఒక ప్రకటన విడుదల చేశారు. విజయవాడకు చెందిన పిల్లల గుండె వైద్య నిపుణులు డాక్టర్ కె.విక్రమ్ (ఇంటర్‌వెన్షనల్ పీడియాట్రిక్ కార్డియాలజిస్ట్) పిల్లలను పరిశీలించి అవసరమైన వారికి పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. 15 సంవత్సరాల్లోపు వయస్సుగల చిన్నారులకు మెడికల్ క్యాంపులో ఉచిత పరీక్షలు, చికిత్స అందిస్తారని తెలిపారు. ఈ వైద్య శిబిరంను భీమవరం, భీమవరం చుట్టు పక్కల ప్రాంతాల వారు వినియోగించుకోవాలని కోరారు.

అవకతవకలు తేల్చారు.. చర్యలు మరిచారు..!

గరగపర్రు డ్వాక్రా గ్రూపుల్లో అవినీతిపై అంతా గప్‌చుప్

అధికారుల తీరుపై విమర్శలు వెల్లువ

జిల్లా అధికారులు దృష్టి సారిస్తే మరిన్ని అంశాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందంటున్న మహిళలు

ప్రజాశక్తి - పాలకోడేరు

డ్వాక్రా సంఘాల్లో అవకతవకలు జరిగినట్లు డ్వాక్రా మహిళా స్వయంగా జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. దీనిపై విచారణ చేపట్టిన అధికారులు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. రూ.9.60 లక్షలు గోల్‌మాల్ జరిగిందని, సంబంధిత డ్వాక్రా సంఘాల నిర్వాహకులు వారం రోజుల్లో ఆ సొమ్ము జమ చేయాలని ఆదేశాలు జారీ చేశారు. ఈ తతంగమంతా జరిగి సుమారు మూడు నెలలైంది. సంబంధిత డ్వాక్రా సంఘాల నిర్వహణపై నేటికీ ఎటువంటి చర్యలూ తీసుకోలేదు. పైగా కనీసం గోల్‌మాల్ చేసిన సొమ్మును రికవరీ కూడా చేయలేదు. ఈ నేపథ్యంలో అధికారుల వింతపోకడపై అనేక విమర్శలు విన్పిస్తున్నాయి. ఈ గోల్‌మాల్‌లో అధికారులు పాత్ర కూడా ఉందని పలువురు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే అవకతవకలు జరిగాయని నిర్ధారించిన అధికారులు సంబంధీకులపై చర్యలు తీసుకోలేదని డ్వాక్రా మహిళలు ఆరోపిస్తున్నారు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వారు పలుమార్లు ఘర్షణ పడటం, పోలీస్ స్టేషన్ మెట్లు ఎక్కడం జరుగుతున్నా.. రూ.లక్షల్లో అవినీతి జరిగినట్లు గుర్తించినా జిల్లా అధికారుల మౌనం వెనుక ఆంతర్యమేమిటో అర్థం కాని పరిస్థితి నెలకొంది. పలురకాల ఒత్తిళ్ల కారణంగా కొంతమందిని ఈ అవకతవకల నుంచి తప్పించాలని ప్రయత్నాలు జరుగుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. అధికారుల నాన్చుడి ధోరణితో ప్రశాంతమైన పల్లెలో ఘర్షణ వాతావరణం నెలకొందని అంతా ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



గరగపర్రులో విచారణ (ఫైల్‌ఫొటో)

వెంకటలక్ష్మి ఫిర్యాదుతో వెలుగులోకి


గరగపర్రు డ్వాక్రా గ్రూపులకు సంబంధించిన నిధులను గ్రామంలో పనిచేసే కొందరు సిబ్బంది స్వాహా చేసినట్లు గ్రామానికి చెందిన డ్వాక్రా మహిళ వెంకటలక్ష్మి ఈ ఏడాది ఫిబ్రవరిలో జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. తమ గ్రామ సంఘం నుంచి మిగిలిన గ్రామ సంఘాలకు వెళ్లిన నగదు వివరాలు కూడా తేల్చాలని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ ఫిర్యాదుపై ఎపిఎం రవికుమార్, డిజిఎం కాంతారావు, సీసీ శారద మార్చిలో ప్రాథమిక విచారణ చేపట్టారు. ఈ విచారణలో సిబ్బంది అవకతవకలు పాల్పడ్డారని గుర్తించారు. తనిఖీ చేసిన గ్రామంలోని నాలుగు గ్రామ సంఘాల్లో ఒక గ్రామ సంఘం విచారణ పూర్తి చేశామని అధికారులు చెబుతున్నారు. విచారణ పూర్తి చేసిన గరగపర్రు గ్రామ సంఘంలో రూ.9.60 లక్షలు అవకతవకలు జరిగినట్లు గుర్తించారు. ఒక్క గ్రామ సంఘంలోనే రూ.లక్షల్లో సొమ్ము గోల్‌మాల్ జరిగినట్లు వెలుగులోకి వస్తే మిగిలిన మూడు గ్రామ సంఘాలను సైతం పరిశీలించాల్సిన బాధ్యత సంబంధిత అధికారులపై ఉంది. అయితే ఎక్కడా ఆ కోణంలో ఇక్కడ విచారణ పూర్తిస్థాయిలో చేపట్టకపోవడం గమనార్హం.

అధికారుల పాత్రపై అనుమానాలు

ప్రస్తుతం విచారణలో అధికారులు గుర్తించిన అవకతవకల్లో గతంలో పనిచేసిన సీసీ రామచంద్రరావు, ఇతర అధికారుల పాత్ర ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. గ్రామ సంఘాల రికార్డులను తనిఖీ చేసి ఎక్కడైనా నగదు, జమ ఖర్చుల్లో తేడాలుంటే వాటిని వెంటనే సరి చేయాల్సిన బాధ్యత సీసీపై ఉంటుంది. గతంలో పనిచేసిన సీసీ రామచంద్రరావు తమ నుంచి నగదు వసూళ్లకు పాల్పడ్డారని ప్రస్తుతం ఆరోపణలు ఎదుర్కొంటున్న విఒఎ భవాని లిఖితపూర్వకంగా ఆరోపించినప్పటికీ అధికారులు దృష్టి సారించిన దాఖలాల్లేవు. తనకు సంబంధం లేని వాటిని కూడా తనపై రుద్దేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని భవాని ఆరోపిస్తుంది. ఓబి ప్రెసిడెంట్లు, అధికారులు తప్పించుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేస్తోంది. ఈ అవకతవకలకు గతంలో పని చేసిన సీసీ రామచంద్రరావు బాధ్యులని ఆమె ఆరోపిస్తున్నారు. తాను ఇప్పటికే రూ.30 వేలు సొమ్ము జమ చేశానని భవాని ప్రజాశక్తికి తెలిపారు.

బాధ్యులపై చర్యలు తీసుకుంటాం
డిఆర్‌డిఎ పీడీ వేణుగోపాల్

గరగపర్రు గ్రామంలో డ్వాక్రా సంఘాల్లో అక్రమాలపై విచారణ చేసి వారం రోజుల్లో తేలుస్తాం. ఇప్పటివరకు ఆ గ్రామంలోని నాలుగు గ్రామసంఘాల్లో ఒక గ్రామ సంఘం అవకతవకలను ప్రాథమికంగా గుర్తించారు. మిగిలిన మూడు గ్రామ సంఘాల్లోని పరిస్థితిని పూర్తిస్థాయిలో విచారించి బాధ్యులైన సిబ్బందిపై చర్యలు తీసుకుంటాం.



చీఫ్ జస్టిస్‌ను సత్కరిస్తున్న ఎంఎల్‌ఎ

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా పశ్చిమవాసి గర్వకారణం

ఆకుల శేషసాయిని సత్కరించిన ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్

ప్రజాశక్తి - భీమవరం రూరల్

హైకోర్టు చీఫ్ జస్టిస్‌గా ఆకుల శేషసాయి నియమితులు కావడం మన జిల్లాకే గర్వకారణమని ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ అన్నారు. ఆదివారం ఎంఎల్‌ఎ గ్రంధి శ్రీనివాస్ భీమవరంలోని శేషసాయి స్వగృహానికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనను ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ భీమవరం అనే పదంలోనే వరం ఉందని, జిల్లాల పునర్విభజనలో భీమవరం కేంద్రంగా పశ్చిమగోదావరి జిల్లా ఏర్పడటం ఒక వరమైతే, భీమవరానికి చెందిన ఆకుల శేషసాయి హైకోర్టు చీఫ్‌జస్టిస్‌గా నియమితులు కావడం భీమవరం ప్రజలకే కాకుండా పశ్చిమగోదావరి జిల్లాకే గర్వకారణమని అన్నారు. రానున్న రోజుల్లో ఆకుల శేషసాయి మరిన్ని ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎపిపి మారిశెట్టి వెంకటేశ్వరరావు, చెరుకువాడ రంగసాయి తదితరులు పాల్గొన్నారు.

24 నుంచి ఇంటర్ సప్లిమెంటరీ పరీక్షలు

ప్రజాశక్తి - ఏలూరుఅర్బన్



ఈ నెల 24వ తేదీ నుండి జూన్ తొమ్మిదో తేదీ వరకు నిర్వహించే ఇంటర్ అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లూ పూర్తి చేసినట్లు ఇంటర్ ప్రాంతీయ పర్యవేక్షణాధికారి కె.చంద్రశేఖర్‌బాబు తెలిపారు. ఆదివారం స్థానిక కోటదిబ్బపై తన కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ నెల 24వ తేదీ నుంచి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 69 కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. మొదటి సంవత్సరం విద్యార్థులకు ఉదయం తొమ్మిది గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు, రెండో సంవత్సరం విద్యార్థులకు మధ్యాహ్నం రెండున్నర గంటల నుండి సాయంత్రం ఐదున్నర గంటల వరకూ పరీక్ష నిర్వహిస్తామని, ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు విద్యార్థులను అనుమతించబోరని స్పష్టం చేశారు. విద్యార్థులను ఉదయం 8:30 గంటల నుంచి, మధ్యాహ్నం రెండు గంటల నుంచి పరీక్షా కేంద్రాల్లోకి అనుమతిస్తారని తెలిపారు. ఉమ్మడి జిల్లావ్యాప్తంగా మొదటి సంవత్సరం సాధారణ విద్యార్థులు 20,927 మంది, వృత్తి విద్యా విభాగంలో 1979 మంది మొత్తం 22,906 మంది పరీక్షలకు సన్నద్ధమవుతున్నారని తెలిపారు. ద్వితీయ సంవత్సరం సాధారణ విద్యార్థులు 9297 మంది వృత్తి విద్యా విభాగంలో 2,089 మంది మొత్తం 11,386 మంది హాజరవుతారని వివరించారు. అలాగే జూన్ రెండో తేదీన మొదటి సంవత్సరం విద్యార్థులకు నైతికత-మానవత విలువలు అనే పరీక్ష ఉంటుందని, మూడో తేదీ పర్యావరణ విద్యపై పరీక్ష ఉంటుందని, ఈ పరీక్షలు ఉదయం 10 గంటల నుంచి ఒంటి గంట వరకు విద్యార్థులు ఏ కళాశాలలో చదువుతున్నారో ఆ కళాశాలలోనే జరుగుతాయని తెలిపారు. జూన్ 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు సప్లిమెంటరీ ప్రాక్టికల్ పరీక్షలు జరుగుతాయని, దీనికి జిల్లావ్యాప్తంగా ఒక్క కేంద్రం మాత్రమే ఏర్పాటు చేశారని, ఏలూరు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో మాత్రమే జరుగుతాయని వివరించారు. అన్ని పరీక్షా కేంద్రాల్లో సీసీ కెమెరా నిఘాలోనే పరీక్షలు నిర్వహిస్తామని, ఇవి ఆర్ఐఒ కార్యాలయానికి, ఇంటర్మీడియట్ బోర్డుకు అనుసంధానమై ఉంటాయని తెలిపారు. పరీక్షా కేంద్రాలన్నింటినీ సెల్‌ఫోన్ రహిత జోన్‌గా ప్రకటించామన్నారు. చీఫ్ సూపరింటెండెంట్‌లు అందరూ వేసవి దృష్ట్యా తాగునీరు, వైద్యం, విద్యుత్ వంటి సదుపాయాలు ప్రతి పరీక్షా కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పరీక్షా కేంద్రాల పరిధిలో 144 సెక్షన్ అమలులో ఉంటుందని, పరీక్షా కేంద్రానికి దగ్గరలో ఉన్న జిరాక్స్, ఇంటర్‌నెట్ సెంటర్‌లు మూసివేసేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. నాలుగు ఫ్లయింగ్ స్క్వాడ్‌లు, ఐదు సిట్టింగ్ స్క్వాడ్‌లు, ఒక హైపవర్ కమిటీ నిరంతరం పరీక్షలను పర్యవేక్షిస్తాయన్నారు. పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులతోపాటు ఇన్విజిలేటర్లకు, డిపార్టుమెంటల్ ఆఫీసర్లకు, చీఫ్ సూపరింటెండెంట్‌లకు కూడా సెల్‌ఫోన్ అనుమతి లేదని ఆయన స్పష్టం చేశారు.

మినీ మహానాడుకు పెదఅమిరం ముస్తాబు

నేడు సాయంత్రం సభ

ప్రజాశక్తి - కాళ్ల

పెదఅమిరం గ్రామం టిడిపి మినీమహానాడుకు ముస్తాబైంది. ఆ గ్రామంలో లిబర్టీ ఫ్యాక్టరీ ఎదురుగా ఉన్న ఖాళీ స్థలంలో సోమవారం సాయంత్రం ఎన్‌టిఆర్ శతజయంతి ఉత్సవాల్లో భాగంగా మినీ మహానాడును నిర్వహించేందుకు టిడిపి నేతలు అన్ని ఏర్పాట్లూ సిద్ధం చేశారు. జువ్వలపాలెం రోడ్డు, పెదఅమిరం రోడ్డుకు ఇరువైపులా టిడిపి ఫ్లెక్సీలు, జెండాలు, తోరణాలను ఏర్పాటు చేశారు. ఉండి ఎంఎల్‌ఎ మంతెన రామరాజు దగ్గరుండి మినీమహానాడు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ మినీ మహానాడుకు టిడిపి రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు, జోన్-2 ఇన్‌ఛార్జి ప్రత్తిపాటి పుల్లారావు, జిల్లా అధ్యక్షురాలు తోట సీతారామలక్ష్మి ముఖ్యఅతిథులుగా విచ్చేయనున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల నేతలు, ప్రజాప్రతినిధులు ఈ సభకు విచ్చేయనున్నారని నిర్వాహకులు తెలిపారు. జిల్లాలోని వివిధ నియోజకవర్గాల నుంచి పార్టీ శ్రేణులు ప్రత్యేక వాహనాల్లో పెదఅమిరం తరలిరానున్నారని చెప్పారు.



సిద్ధమైన సభా వేదిక



ముస్తాబైన సభా ప్రాంగణం

కౌలురైతు కుటుంబానికి రూ.పది లక్షలు పరిహారం చెల్లించాలి

ప్రజాశక్తి - పెనుగొండ

ఈదురుగాలులు, అకాల వర్షానికి తాటిచెట్టు పడి మృతి చెందిన కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోవాలని కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు డిమాండ్ చేశారు. మండలంలో శనివారం సాయంత్రం వీచిన పెనుగాలులకు తాటి చెట్టు మీద పడి మృతి చెందిన సిద్దాంతం నాగమ్మ కాలనీకి చెందిన కౌలురైతు పులిమి రాము కుటుంబాన్ని సంఘం నేతలు ఆదివారం పరామర్శించారు. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ సిద్ధాంతం గ్రామంలో పులిమి రాము ఆరెకరాల కౌలుభూమి సాగు చేస్తున్నారన్నారు. పంట మాసూళ్ల చేస్తున్న సమయంలో ఒక్కసారిగా వచ్చిన పెనుగాలులకు ధాన్యపు రాశి వద్ద ఉన్న తాటిచెట్టు విరిగి మీద పడటంతో రాము అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారన్నారు. మృతుని భార్య పులిమి సావిత్రి మాట్లాడుతూ గత వారం రోజులుగా ధాన్యం పట్టేందుకు సంచుల కోసం తిరుగుతున్నారని, వర్షం వచ్చేలా ఉందని రాశులపై బరకాలు కప్పేందుకు శనివారం సాయంత్రం పొలం వెళ్లిన మనిషి తిరిగి రాలేదని కన్నీటిపర్యంతమయ్యారు. చాలాకాలంగా కౌలుకు సాగు చేస్తున్నా కౌలు కార్డు ఇవ్వకపోవడంతో భూయజమాని పేరునే పంట అమ్ముకుంటున్నామని తెలిపారు. వ్యవసాయం, కుటుంబ అవసరాల నిమిత్తం చేసిన అప్పు ఏడు లక్షల వరకూ ఉందని, ఇక తమ కుటుంబానికి దిక్కెవరని ఆమె వాపోయింది. ఈ సందర్భంగా రామాంజనేయులు మాట్లాడుతూ భూయజమాని సంతకం పెడితేనే కౌలు కార్డు ఇవ్వాలనే నిబంధన వల్ల కౌలు కార్డులు అందడం లేదని తాము చెబుతున్న మాటలకు ఇదే నిదర్శనమని, ఈ కుటుంబాన్ని ప్రభుత్వం తక్షణం ఆదుకోవాలని కోరారు. రూ.పది లక్షలు నష్టపరిహారం ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయాన్ని మండల వ్యవసాయాధికారి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి రైతు నేతల పరామర్శ



కౌలురైతు కుటుంబాన్ని పరామర్శిస్తున్న నేతలు

కౌలురైతు కుటుంబాన్ని ఆదుకోండి: సిపిఎం

ఈదురు గాలులకు తాటి చెట్టు పడి మృతి చెందిన కౌలు రైతు రాము కుటుంబాన్ని ఆదుకోవాలని సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కేతా గోపాలన్ విజ్ఞప్తి చేశారు. ఆదివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కౌలురైతు రాము మృతి బాధాకరమన్నారు. ప్రభుత్వ వైఫల్యం వల్ల ధాన్యం అమ్మకాలు సక్రమంగా సాగక కౌలురైతు ప్రాణం బలిగొన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి ప్రభుత్వమే బాధ్యత వహించి మృతుని కుటుంబాన్ని ఆదుకోవాలని, నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట సిపిఎం నేతలు ఎస్.వెంకటేశ్వరరావు, కప్పల రత్నరాజు ఉన్నారు.


నేడు 'ప్రభుత్వ విధానాలు-కార్మికవర్గ కర్తవ్యం'పై సదస్సు

ప్రజాశక్తి - భీమవరం

సిఐటియు వ్యవస్థాపక అధ్యక్షులు, అమరజీవి పర్స సత్యనారాయణ వర్థంతి సందర్భంగా సోమవారం స్థానిక యుటిఎఫ్ కార్యాలయంలో సదస్సు నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు జెఎన్‌వి.గోపాలన్, కె.రాజారామ్మోహన్‌రాయ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. పర్స సత్యనారాయణ జీవితాంతం కార్మికోద్యమం కోసం కృషి చేశారని, సిఐటియు ఆవిర్భావంలో కీలకపాత్ర పోషించారని పేర్కొన్నారు. కార్మికవర్గం కోసం ఆయన చేసిన కృషిని తెలియజేస్తూ 'ప్రభుత్వ విధానాలు-కార్మికవర్గ కర్తవ్యం' అనే అంశంపై సదస్సు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సదస్సుకు వ్యవసాయ కార్మిక సంఘం పూర్వపు రాష్ట్ర కార్యదర్శి మంతెన సీతారాం హాజరవుతున్నారని పేర్కొన్నారు. అభ్యుదయవాదులు అందరూ ఈ సభకు హాజరుకావాలని కోరారు.

జగన్ గెలుపునకు వాలంటీర్లు సహకరించాలి

ప్రజాశక్తి - అత్తిలి



వాలంటీర్లతో మంత్రి కారుమూరి నాగేశ్వరరావు

వాలంటీర్ల ఆశీస్సులతో మరోసారి జగన్ ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి కారుమూరి వెంకట నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం స్థానిక వల్లి సుబ్రహ్మణ్యస్వామి కళ్యాణ మండపంలో సేవావజ్ర, సేవారత్న, సేవామిత్రలకు ఎంపికైన వాలంటీర్లకు సన్మాన కార్యక్రమం ఎంపిపి మక్కా సుర్యనారాయణరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి కారుమూరి మాట్లాడుతూ కాల్దారిలో ముగ్గురు రైతులను పొట్టనబెట్టుకున్న చంద్రబాబు రైతు శ్రేయస్సు కోరుకుంటున్నారంటే విస్మయం కల్గిస్తోందన్నారు. జగన్ మానస పుత్రికల్లాంటి వాలంటీర్లను అవహేళన చేయడం చంద్రబాబుకు సిగ్గుచేటని విమర్శించారు. త్వరలోనే రూ.35 కోట్లతో రేలంగి మీదుగా ఈడూరు వరకూ రెండు లైన్ల రోడ్డు నిర్మిస్తారని తెలిపారు. కరోనా సమయంలో తన నియోజకవర్గంలో కేసులు పెద్దగా నమోదు కాకుండా జాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా వ్యవహరించిన వాలంటీర్ల సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఇటీవల శస్త్రచికిత్స చేయించుకున్న వరిగేడుకు చెందిన వాలంటీర్ వంశీకి మంత్రి కారుమూరి రూ.15 వేలు నగదు అందజేశారు. అనంతరం వాలంటీర్లకు పురస్కారాలను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచి గంటా విజేత, ఎఎంసి ఛైర్మన్ బుద్ధరాజు భరణిప్రసాద్, వైసిపి మండలాధ్యక్షుడు బైపే సత్యనారాయణ, జెడ్‌పిటిసి అడ్డాల జానకీ, అధికారులు, వైసిపి నేతలు పాల్గొన్నారు.

ఘాటెక్కిన అల్లం, వెల్లుల్లి ధరలు

ప్రజాశక్తి - పాలకొల్లు

మార్కెట్లో అల్లం, వెల్లుల్లి ధరలు ఘాటెక్కాయి. గత నెల వరకు సామాన్య, మధ్యతరగతి ప్రజలకు అందుబాటులో ఉన్న ఈ రెండు నిత్యావసరాల ధరలు దారుణంగా పెరిగాయని మహిళలు ఆందోళన చెందుతున్నారు. అల్లం ధర కిలో రూ.30 నుంచి రూ.50 వరకూ పలికేది. ప్రస్తుతం దాని ధర కిలో రూ.200 నుంచి రూ.300 వరకూ పలుకుతోంది. వెల్లుల్లి కూడా కిలో రూ.40 నుంచి రూ.60 వరకూ పలుకుతోంది. ప్రస్తుతం నాణ్యతను బట్టి కిలో రూ.120 నుంచి రూ.250 వరకూ పలుకుతోంది. ఈ రెండింటి పేస్ట్ లేనిదే మాంసాహార వంటలు తయారు కావు. పలావు, ఇతర కూరలకు ఇవి తప్పనిసరి. దీంతో మాంసాహార ప్రియులు పెరిగిన ధరలతో గగ్గోలు పెడుతున్నారు. వేసవిలో చికెన్ ధర ఎక్కువగా ఉంటుంది. దీంతో మాంసాహార ప్రియులు పెరిగిన ధరలతో గగ్గోలు పెడుతున్నారు. ప్రస్తుతం వివాహ వేడుకలు ఎక్కువగా జరుగుతున్నాయి. అల్లం, వెల్లుల్లి ధరలు ఎక్కువగా ఉండటంతో భోజనాల బడ్జెట్ ఎక్కువగా ఉందని నిర్వాహకులు చెబుతున్నారు.



రెస్టారెంట్ల నిర్వాహకుల గగ్గోలు

కొంతకాలంగా పాలకొల్లులో రెస్టారెంట్ల సంఖ్య పెరిగిపోతుంది. దీంతో అమ్మకాలు తగ్గి ఖర్చులు పెరుగుతున్నాయని నిర్వాహకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో అల్లం, వెల్లుల్లి, చికెన్ ధరలు దారుణంగా పెరగడంతో నష్టాల ఊబిలో ఉన్నట్లు రెస్టారెంట్ల నిర్వాహకులు వాపోతున్నారు. వేసవిలో మాంసాహార వంటకాల అమ్మకాలు తగ్గాయని, దీంతో నష్టాలు ఎక్కువగా ఉన్నాయని చెబుతున్నారు.

అల్లం, వెల్లుల్లి ధరలు బాగా పెరిగాయి


కర్నేన రోజారమణి, గృహిణి, పాలకొల్లు



కొంతకాలం క్రితం వరకూ అందరికీ అందుబాటులో ఉన్న అల్లం, వెల్లుల్లి ధరలు దారుణంగా పెరిగాయి. ప్రతిరోజూ వంటింట్లో ఏదోరకంగా వీటి వాడకం తప్పనిసరి. ప్రభుత్వం పెరిగిన నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలి.

నష్టాల్లో రెస్టారెంట్లు

చినిమిల్లి గణపతిరావు, హోటల్ యజమాని, పాలకొల్లు



పాలకొల్లు పట్టణంలో రెస్టారెంట్ల సంఖ్య పెరగడం, అల్లం, వెల్లుల్లి, చికెన్ ధరలు పెరగడంతో హోటల్ పరిశ్రమ నష్టాల్లో ఉంది. ఇతర రాష్ట్రాల వంట మేస్త్రీల ధరలు దారుణంగా పెరిగాయని, దీంతో పెట్టుబడి పెరిగి.. అమ్మకాలు తగ్గి నష్టాలు ముసురుకున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

చెంపలేసుకుని వినూత్న నిరసన

12వ రోజు కొనసాగిన పాలకోడేరు రైతుల ఆందోళన

ప్రజాశక్తి - పాలకోడేరు



నిరసన తెలుపుతున్న బాధిత రైతు కుటుంబాలు

ప్రభుత్వ ఇళ్ల స్థలాలకు భూములిచ్చిన పాలకోడేరు జగనన్న లేఅవుట్ నిర్వాసిత రైతులు తమకు వెంటనే పరిహారం చెల్లించాలని కోరుతూ ఆదివారం వినూత్న రీతిలో నిరసన తెలిపారు. కోటిగట్టు జగనన్న లేఅవుట్ ప్రాంతంలో బాధిత రైతులు చేపట్టిన ఆందోళన 12వ రోజుకు చేరింది. దీనిలో భాగంగా చెంపలేసుకుని వినూత్నరీతిలో నిరసన తెలిపారు. మండుటెండలో రెండు వారాలుగా నిరసన తెలుపుతున్నా అధికారులు స్పందించకపోవడంపై బాధిత రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. విపక్షాలన్నీ తమకు మద్దతు తెలియజేస్తున్నా అధికార వైసిపి నాయకులు తమ సమస్యను పరిష్కరించడంలో నిర్లక్ష్యం చూపుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో బాధిత రైతులు నల్లి రామలక్ష్మి, కారింకి సత్యనారాయణ, సంబలదీవి సాయిబాబు, గ్రామస్తులు పాల్గొన్నారు.



బీచ్‌లో పర్యాటకుల సందడి

పేరుపాలెం బీచ్‌లో పర్యాటకుల సందడి

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని పేరుపాలెం బీచ్ ఆదివారం పర్యాటకులతో సందడి సందడిగా మారింది. పర్యాటకులు, ప్రకృతి ప్రేమికులు ప్రత్యేక, ద్విచక్ర వాహనాలపై ఉదయమే బీచ్‌కు చేరుకున్నారు. పలువురు సముద్ర స్నానాలు చేశారు. చిన్నారులు ఇసుక తెన్నెలపై ఒడ్డుకు కొట్టుకొస్తున్న కెరటాలతో ఆడుకున్నారు. ఒడ్డున ఉన్న ఆలయాలను దర్శించుకుని సరివి, కొబ్బరి తోటల్లో సేదతీరారు.

బార్ అసోసియేషన్ ఎన్నికలు వాయిదా

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ఈ నెల 26న జరగాల్సిన నరసాపురం బార్ అసోసియేషన్ ఎన్నికలను వాయిదా వేసినట్లు ఎన్నికల అధికారి, న్యాయవాది పూరిళ్ల శ్రీనివాస్ తెలిపారు... కోర్టులకు వేసవి సెలవుల దృష్ట్యా ఎన్నికలను వాయిదా వేశామన్నారు. కోర్టులకు వేసవి సెలవుల అనంతరం ఈ ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

అమలు కాని ఉపాధి హామీ చట్టం

విలీన గ్రామాల్లో సామాన్య కూలీల అవస్థలు
పనులు కల్పించాలని వేడుకోలు

ప్రజాశక్తి - పాలకొల్లు

పట్టణంలో ఇటీవల విలీనమైన గ్రామాల్లో ఎన్ఆర్ఇజిఇఎస్ నిధులు ఖర్చు చేయకపోవడంతో ఉపాధి హామీ చట్టం అమలు గాక సామాన్య కూలీలు ఉపాధి లేక అర్ధాకలితో అలమటిస్తున్నారు. పట్టణంలో రూరల్‌పంచాయతీ, పూలపల్లి, ఉల్లంపర్రు, వరిధనం, భగ్గేశ్వరం గ్రామాలు విలీనమయ్యాయి. కోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటంతో యలమంచిలి మండలం కొంతేరు, అడవిపాలెం గ్రామాలు ఇంకా విలీనం చేయలేదు. ఏప్రిల్ ఒకటో తేదీ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరంలో విలీన గ్రామాల రికార్డులు మున్సిపల్ అధికారులకు అప్పగించాలని జిల్లా పంచాయతీ అధికారి చెప్పినా అమలు కాలేదు. గత నెల కలెక్టర్ విలీన గ్రామాల్లో రికార్డులు మున్సిపల్ కమిషనర్‌కు అప్పగించాలని ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పటివరకు తమకు డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ నుంచి ఉత్తర్వులు రాలేదని మున్సిపల్ కమిషనర్ శేషాద్రి తెలిపారు.


విలీన గ్రామాల్లో గతేడాది, ఈ ఏడాది ఉపాధి హామీ చట్టం అమలు కావడంలేదు. దీంతో సామాన్య కూలీల పరిస్థితి దుర్భరంగా ఉంది. ఇటు పంచాయతీ గాక అటు మున్సిపల్ నిధులు రాక గ్రామస్తులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. కేవలం పంచాయతీ సచివాలయ సిబ్బంది రోజువారీ పనులు చేస్తున్నారు. దీంతో పారిశుధ్య సమస్య ఏర్పడుతోంది.

ఉత్తర్వులు రాలేదు
మున్సిపల్ కమిషనర్ శేషాద్రి



పాలకొల్లులో విలీన గ్రామాల్లో పంచాయతీ సిబ్బంది నుంచి బాధ్యతలు తీసుకోవాలని కలెక్టర్ గత నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. దీనిపై తమ ఉన్నతాధికారులకు అనుమతి కోసం రాశామని, ఇప్పటివరకు తమకు అనుమతి రాలేదని చెప్పారు. విలీనం అయ్యాక మాస్టర్ ప్లాన్ అమలు చేస్తామని చెప్పారు.

విలీన గ్రామాల్లో ఉపాధి హామీ నిధులు నిలిచాయి
అమీర్ షరీఫ్, ఇఒపిఆర్‌డి, పాలకొల్లు



గతేడాది నుంచి పాలకొల్లు మున్సిపాలిటీలో విలీనమైన గ్రామాలకు ఉపాధి హామీ చట్టం అమలు కావడం లేదు. మండలంలోని మిగిలిన గ్రామాల్లో యధాతథంగా ఉపాధి హామీ చట్టం అమలు జరుగుతోంది.

ఉపాధి హామీ చట్టం అమలు చేయకపోవడం దారుణం
సిఐటియు మండల కార్యదర్శి జవ్వాది శ్రీనివాస్



పాలకొల్లు మున్సి పాలిటీలో విలీనమైన గ్రామాల్లో ఉపాధి హామీ చట్టం అమలు చేయకపోవడం దారుణం. ఇంకా పూర్తిగా మున్సిపాలిటీలో విలీన మయ్యేవరకు పేదల కడుపు నింపే ఉపాధి హామీ చట్టం అమలు చేయాలి. విలీనం ద్వారా కూలీల బతుకులు మెరుగు పడాలి కాని దుర్భరంగా తయ్యారవ్వకూడదు.

మాకు న్యాయం చేయండి..!

దంపతుల ఆవేదన

ప్రజాశక్తి - పెనుమంట్ర

తమకు న్యాయం చేయాలని మండలంలోని నెలమూరు గ్రామానికి చెందిన దంపతులు యరకరాజు సోమరాజు, అతని భార్య ముత్యాలమ్మ వేడుకుంటున్నారు. తమ అల్లుడి వల్ల తాము అప్పులపాలయ్యామని, అన్యాయం జరిగిందని, తమకు న్యాయం చేయాలని అధికారులను కోరుతున్నారు. ఈ మేరకు వారు ఆదివారం మీడియాతో మాట్లాడారు. తమ చిన్న కుమార్తె వరలక్ష్మిని తరిమిశ గ్రామానికి చెందిన ఈదరపల్లి అప్పలరాజు కుమారుడు శివరామరాజుకు ఇచ్చి 2007 ఆగస్టు 21వ తేదీన వివాహం చేశామని చెప్పారు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారన్నారు. ఈ క్రమంలో తమ కుమార్తెను తన భర్తతో పాటు అత్త, మామలు హింసించడంతో తన కుమార్తె వరలక్ష్మిని నెలమూరు తీసుకొచ్చినట్లు చెప్పారు. కొన్నిరోజుల తర్వాత తమ అల్లుడు శివరామరాజు చెరువులు మీద పని చేశాడు. జీతం సరిపోకపోవడంతో నెలమూరు వచ్చి పని చేసుకుంటూ ఉంటున్నాడు. ఈ క్రమంలో తమ అల్లుడికి ఇల్లు లేకపోవడంతో గ్రామ పెద్దల సహకారంతో ఇళ్ల స్థలం తన కుమార్తె వరలక్ష్మి పేరును రాయించినట్లు చెప్పారు. దాని నిమిత్తం తాము అప్పులపాలయ్యామన్నారు. అల్లుడుని ఆ అప్పు తీర్చమని కోరగా తన వల్ల కాదని చేతులెత్తేశాడన్నారు. అల్లుడు పేరుతో ఎల్ఐసి కూడా తానే సొంత డబ్బులు కట్టానని ముత్యాలమ్మ తెలిపారు. అల్లుడు శివరామరాజును సంతకం పెట్టమని కోరగా అందుకు కూడా నిరాకరించినట్లు తెలిపింది. ఈ విషయంపై గ్రామ పెద్ద కుచ్చర్లపాటి వెంకటపతిరాజుతో ఫోన్ చేయించినా పెద్దల మాటకు కూడా విలువ ఇవ్వలేదని ముత్యాలమ్మ తన ఆవేదన వ్యక్తం చేసింది. తన కుమార్తె పెళ్లి సందర్భంగా రూ.50 వేల కట్నం కూడా ఇచ్చామని చెప్పారు. పెద్దల మాట వినకపోగా దిక్కున్న చోట చెప్పుకోండని అల్లూరి శివరామరాజు సమాధానం ఇచ్చాడు. శివరామరాజు అన్న అయిన నాగరాజుకు ఫోన్ చేసినా తమ్ముడి విషయంలో ఎటువంటి సమాధానం చెప్పలేదన్నారు. శివరామరాజు తండ్రి అప్పలరాజుకు ఫోన్ చేసినా ఎటువంటి సమాధానం చెప్పలేదన్నారు. మీ కోడల్ని మీ మనవరాళ్లను మీ ఇంటికి తీసుకువెళ్లండని అడిగినా తాము తీసుకువెళ్లబోమని మొండి సమాధానం చెప్పారన్నారు. తమకు న్యాయం చేయాలని కోరారు. ఈ విషయంలో తమకు అన్యాయం చేసిన ఈదరపల్లి నాగరాజు, ఈదరపల్లి అప్పలరాజు రాజమండ్రిలో ఉంటారని, గుంటూరు రామచంద్రరాజు పి.పోలవరంలో ఉంటారని, గుంటూరు రామకృష్ణంరాజు పి.పోలవరంలో ఉంటారని, పాతపాటి కొండరాజు నెలమూరులో ఉంటారని, కుచ్చర్లపాటి రామసీత భర్త రామకృష్ణంరాజు హైదరాబాద్‌లో ఉంటారని తెలిపారు. తమకు అన్యాయం చేసిన వీరిపై చర్యలు తీసుకోవాలని ఆ దంపతులు కోరుతున్నారు.



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

విద్యార్థులకు పలు అంశాలపై అవగాహన

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

నరసాపురం ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో విద్యార్థులతో ఆదివారం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, పత్రిక పఠనం చేయించినట్లు గ్రేడ్ వన్ లైబ్రేరియన్ కెజెఎస్ఎల్.కుమారి తెలిపారు. పిల్లలకు దేశ నాయకుల మహాత్మ గాంధీ, జవహర్‌లాల్ నెహ్రు, సర్దార్ వల్లభాయ్ పటేల్, భగత్ సింగ్, అబ్దుల్ కలాం, ఆజాద్ జీవిత చరిత్రలు గురించి వివరించినట్లు చెప్పారు. వార్తాపత్రికలను, దినపత్రికలను పిల్లలకు పరిచయం చేసి వారితో చదివించామన్నారు. అనంతరం స్పోకెన్ ఇంగ్లీష్ క్లాస్, చిత్రలేఖనం, యోగా మెడిటేషన్, ఇంగ్లీష్ ట్రాన్స్‌లేషన్, జీకే క్లాసులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త సుబ్బారావు, స్కూల్ అసిస్టెంట్ శ్రీనివాస్, సుధీర్ మోహన్, జీవన్ కుమార్, జ్యోత్స్న, మోటివేషనల్ స్పీకర్ నాగశ్రీ, టీచర్ విఎస్.నాగలక్ష్మి, సూర్యనారాయణ, పిల్లల తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొన్నారు. విరామ సమయంలో స్నాక్స్ ఇచ్చినట్లు చెప్పారు. జూన్11 వరకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తారని, పిల్లలందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

లయన్స్ క్లబ్ మరిన్ని సేవలందించాలి

గట్టిం మాణిక్యాలరావును అభినందించిన ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం



మాణిక్యాలరావును అభినందిస్తున్న ఎంఎల్‌సి రవీంద్రనాథ్

లయన్స్ క్లబ్ అంతర్జాతీయ ఖ్యాతి పొందిందని, రానున్న 2023-24 సంవత్సరంలో పేద ప్రజలకు మరిన్ని సేవలు అందించాలని ఎంఎల్‌సి వంకా రవీంద్రనాథ్ జిల్లా నూతన గవర్నర్ లయన్ గట్టిం మాణిక్యాలరావుకు సూచించారు. అంతర్జాతీయ లయన్స్ నిబంధనల మేరకు జరిగిన లయన్స్ క్లబ్ ఎన్నికల్లో గవర్నర్‌గా గెలుపొందిన గట్టిం మాణిక్యాలరావును ఆదివారం తాడేపల్లిగూడెం‌లోని వారి నివాసంలో మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. యువతను లయనిజం వైపు మరలించి సేవా కార్యక్రమాల్లో భాగం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో లయన్స్ వట్టి ప్రోలురాము, పాండు రంగారావు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఫ్లెక్సీ ధ్వంసం దారుణం


ప్రజాశక్తి - ఆచంట

బిఆర్.అంబేద్కర్ ఫ్లెక్సిని ధ్వంసం చేసిన వారిని గుర్తించి కఠినంగా శిక్షించాలని అంబేద్కర్ యువసేన వ్యవస్థాపక అధ్యక్షులు సుంకర సీతారామ్ డిమాండ్ చేశారు. మండలంలోని పెనుమంచిలి పంచాయతీ పరిధి రాయికింద ఏరియాలో కాలువ వంతెన దగ్గర అంబేద్కర్ యూత్ ఏర్పాటు చేసిన బిఆర్ అంబేద్కర్ ఫ్లెక్సీని శనివారం అర్ధరాత్రి సమయంలో గుర్తు తెలియని దుండగులు చించివేయడం దారుణమన్నారు. ఈ సందర్భంగా పెనుమంచిలి దళిత ఐక్య సంఘం ఆధ్వర్యంలో అంబేద్కర్ ఫ్లెక్సీకి పాలాభిషేకం చేసి, జోహార్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ అంటూ పెద్దఎత్తున నినాదాలు చేశారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా దళిత యువత అంతా సంఘటిత శక్తిగా ఉండాలని సీతారామ్ కోరారు. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఫ్లెక్సీ ధ్వంసం చేసిన వారిని గుర్తించి ఎస్‌సి, ఎస్‌టి అట్రాసిటీ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఐక్య దళిత సంఘ అధ్యక్షులు ఆలూరి చిన్నారావు, తాడి బాల శేఖర్, పొన్న పెద నర్సింహస్వామి, కాశీ శ్రీనివాసరావు, పార్శి శ్రీనివాసరావు, తాడి రామారావు, పార్శి రామారావు, జంగా భాస్కరరావు, జంగా రాముడు, పాల్గొన్నారు.

తాగునీరందించండి మహాప్రభో..!

చిన్నపుల్లేరు గ్రామస్తుల ఆవేదన

ప్రజాశక్తి - ఉండి



తమకు శుద్ధి చేసిన జలాలను అందించాలని చినపుల్లేరు గ్రామస్తులు వేడుకుంటున్నారు. గ్రామంలో సుమారు 1200 మంది ప్రజలు నివాసం ఉంటున్నారని, వారికి శుద్ధి చేసిన తాగునీటిని అందించడంలో పంచాయతీ పాలకవర్గం విఫలమైందని పలువురు విమర్శిస్తున్నారు. గత పంచాయతీ ఎన్నికల్లో గ్రామస్తులకు శుద్ధిచేసిన తాగునీటిని అందిస్తామని హామీ ఇచ్చిన పాలకవర్గం రెండేళ్లు గడుస్తున్నా ఇప్పటివరకు ఆ హామీని నెరవేర్చకుండా తుంగలో తొక్కారన్నారు. పబ్లిక్ కుళాయిల ద్వారా గ్రామ పంచాయతీ అందించే మంచినీరు మురికిగా వస్తున్నాయని, వాటిని తాగలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు వాపోతున్నారు. ఆక్వా చెరువుల వ్యర్థజలాలను ఉండి ప్రధాన పంట కాలువలో వదిలేస్తున్నారని, ఆ నీటిని మంచినీటి చెరువులోకి నింపుతుండగా గ్రామపంచాయతీ ఆ నీటిని శుద్ధి చేయకుండా యధాతథంగా పబ్లిక్ కుళాయిల ద్వారా విడుదల చేస్తున్నారని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఆ నీటిని తాగడం ద్వారా వైరల్ వ్యాధుల బారిన పడుతున్నామని, ఇప్పటికే పలుమార్లు ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లినా ఫలితం లేకపోయిందని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రతి ఇంటికి పబ్లిక్ కుళాయి కనెక్షన్లు ఇస్తామని చెప్పినా ఇప్పటివరకు అది మాటల వరకే పరిమితమైందని, కార్యరూపం దాల్చలేదని పలువురు విమర్శిస్తున్నారు. దీనిపై ఆర్‌డబ్ల్యుఎస్ అధికారి తానింకి శ్రీనివాసరావును వివరణ కోరగా చినపుల్లేరు గ్రామానికి జలజీవన్ మిషన్ పథకంలో రూ.52 లక్షల నిధులు మంజూరయ్యాయని, కాంట్రాక్టర్ త్వరలోనే పని ప్రారంభించి ప్రతి ఒక్కరికి పబ్లిక్ కుళాయి కనెక్షన్ ఇచ్చి శుద్ధి చేసిన మంచినీటిని ఇచ్చేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

తాగునీరు అందించడంలో విఫలం
కోనాల ఏసేబు, చినపుల్లేరు



గ్రామంలో కొంతకాలంగా తాగునీటిని అందించడంలో పంచాయతీ పాలకవర్గం పూర్తిగా విఫలమైంది. ప్రస్తుతం వేసవికాలం ప్రారంభం కావడంతో కాలువలు కట్టేసే సమయం ఆసన్నమవ్వడంతో అధికారులు గ్రామాల్లోని మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపుకోవాలని ఆదేశాలు జారీ చేసినప్పటికీ చినపుల్లేరులోని మంచినీటి చెరువును పూర్తిస్థాయిలో నింపలేదు.

అనారోగ్య బారిన పడుతున్నాం
గోడి చినబాబు, చినపుల్లేరు



గ్రామపంచాయతీ వారు పబ్లిక్ కుళాయిల ద్వారా పంపిణీ చేసే నీటిని తాగడం ద్వారా అనారోగ్య బారిన పడుతున్నాం. కేవలం 1200 మంది జనాభా మాత్రమే ఉన్న చినపుల్లేరు గ్రామానికి మంచినీరు అందించడంలో అధికారులు, పాలకవర్గం ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో అర్థం కావడం లేదు. సుమారు మూడు కిలోమీటర్ల దూరం ప్రయాణించి చుట్టుపక్క గ్రామాలైన పెదపుల్లేరు, సీసలి, జక్కరం తదితర గ్రామాల నుంచి మంచినీరు కొనుక్కుని తెచ్చుకోవాల్సిన దుస్థితి గ్రామంలో నెలకొంది.


లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు అందజేత

ప్రజాశక్తి - గణపవరం

పేదవాడి సొంత ఇంటి కల నెరవేర్చడమే జగన్ ప్రభుత్వ లక్ష్యమని ఉంగుటూరు ఎంఎల్ఎ పుప్పాల శ్రీనివాసరావు (వాసుబాబు) అన్నారు. భువనపల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో ఆదివారం 38 లబ్ధిదారులకు ఇళ్లపట్టాలు ఎంఎల్ఎ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులందరూ ఇంటి నిర్మాణంపై చొరవ చూపించాలన్నారు. లే అవుట్‌లో విద్యుత్, మంచినీరు, రహదారులు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు ఇల్లు నిర్మించుకున్న లబ్ధిదారులకు విద్యుత్ మంచినీటి కుళాయి ప్రభుత్వం వెంటనే అందిస్తుందని చెప్పారు. ఇంటి నిర్మాణానికి కావాల్సిన ఇసుక, సిమెంట్, కిటికీలు ప్రభుత్వమే అందిస్తుందని చెప్పారు. ప్రభుత్వం ఇంటి నిర్మాణానికి రుణ సౌకర్యం కల్పిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు అందిస్తున్న ఎంఎల్ఎ వాసుబాబు




శేషసాయితో ముదునూరి ప్రసాదరాజు

నరసాపురంలో హైకోర్టు చీఫ్ జస్టిస్

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

చీఫ్ జస్టిస్ రాష్ట్ర హైకోర్టుగా నూతనంగా నియమితులైన ఆకుల వెంకట శేషసాయి ఆదివారం నరసాపురం పట్టణం వలందరేవు పుష్కరాల ఘాటుకు వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను రాష్ట్ర ప్రభుత్వ చీఫ్ విప్ ముదునూరి ప్రసాదరాజు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.



రాజీవ్‌గాంధీ విగ్రహానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

రాజీవ్ గాంధీకి నివాళి

ప్రజాశక్తి - పాలకొల్లు

పాలకొల్లు పట్టణ కాంగ్రెస్ కార్యాలయంలో మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ 32వ వర్ధంతి కార్యక్రమాన్ని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు యడ్ల శివాజీ అధ్యక్షతన ఆదివారం నిర్వహించారు. రాజీవ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజీవ్ గాంధీ దేశానికి చేసిన సేవల గురించి కొనియాడారు. ఐటీ రంగాన్ని దేశంలో ప్రవేశపెట్టారన్నారు. మున్సిపల్ కార్యాలయం ఎదురుగా ఉన్న రాజీవ్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు బోనం వెంకట్రావు, షేక్ మహబూబా జాని, వర్ధనపు కాసు, కొలుకులూరి అర్జున్‌రావు, రొక్కాలా బన్నీపాల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.




పానకం పంపిణీ చేస్తున్న వివేక్

బాటసారులకు పానకం పంపిణీ

ప్రజాశక్తి - పెనుమంట్ర

మండలంలోని పొలమూరు రావిచెట్టు సెంటర్‌లో వివేక్ తన తండ్రి పెన్మెత్స పెద్దిరాజు పేరుతో పదేళ్ల నుంచి ప్రతి ఏడాది వేసవి కాలంలో బెల్లం పానకాన్ని అందించి బాటసారుల దాహార్తిని తీర్చుతున్నారు. పెద్దిరాజుకు పేరొందిన ఆయుర్వేద వైద్యులుగా గుర్తింపు ఉంది. ఆయన మరణానంతరం అతని కుమారుడు వివేక్ వేసవికాలంలో పది రోజుల పాటు బెల్లం పానకం, మిరియాలు కలిపిన పానకం రావి చెట్టు సెంటర్ వద్ద బాటసారులకు అందిస్తున్నారు. ప్రతి రోజూ ఒక దాత సహాయంతో పానకాన్ని ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు.



ధర్మరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలుపుతున్న జనసేన నేతలు

ఘనంగా ధర్మరాజు పుట్టినరోజు వేడుక

ప్రజాశక్తి - ఉంగుటూరు

జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ ఫౌండేషన్ ఛైర్మన్ ధర్మరాజు పుట్టినరోజు వేడుకలు ఆదివారం నారాయణపురంలో ఘనంగా నిర్వహించారు. గణపవరం, నిడమర్రు, మండలాల నుంచి జన సైనికులు మోటార్ సైకిల్ ర్యాలీగా వచ్చి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. జనసేన ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా అధ్యక్షుడు కొటికలపూడి గోవిందరావు, నరసాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జి పిఎసి సభ్యులు బొమ్మిడి నాయకర్, కొవ్వూరు జనసేన నాయకులు టివి.రామారావుతో పాటు జిల్లా నాయకులు, మహిళలు పెద్ద ఎత్తున తరలివచ్చి ధర్మరాజుకు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. మండలంలోని జనసైనికులు వచ్చి బొకేలు పూలదండలతో ధర్మరాజును ముంచెత్తారు. అభిమానులు 43 కిలోల కేకును కట్ చేయించారు.

శతాధిక వృద్ధుడు మృతి

ప్రజాశక్తి - పోడూరు



అబ్బులు (ఫైల్)

మండలంలోని పోడూరు గ్రామానికి చెందిన శతాధిక వృద్ధుడు బుడితి అబ్బులు (100) ఆదివారం అనారోగ్యంతో మృతి చెందారు. ఆయన కుమారుడు మాల మహానాడు మండల గౌరవ అధ్యక్షుడుగా ఉన్నారు. అబ్బులు మృతి పట్ల మాల మహానాడు నాయకులు, ప్రజాప్రతినిధులు సంతాపం తెలిపారు.

నేడు వైసిపి నిరసన

ప్రజాశక్తి - పాలకొల్లు

లబ్ధిదారులకు ఇచ్చే సెంటు భూమి శవం పూడ్చడానికి సరిపోదంటూ చంద్రబాబు చేసిన వ్యాఖ్యలకు నిరసనగా సోమవారం పాలకొల్లు వైసిపి కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టినట్లు జెడ్‌పి ఛైర్మన్ కవురు శ్రీనివాస్ తెలిపారు. సిఎం జగన్ రాష్ట్ర వ్యాప్తంగా ఇళ్ల లేని పేదలకు దేశంలో ఎక్కడా లేని విధంగా పెద్ద ఎత్తున ఇళ్ల పట్టాలు ఇచ్చి, ఇళ్లు నిర్మిస్తున్నారన్నారు. ఆయన ఆదివారం పార్టీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. అమరావతిలో 50 వేల మందికి ఇళ్ల పట్టాలు ఇస్తుంటే పేద, బడుగు, బలహీన వర్గాల ప్రజలను కించపరిచేలా చంద్రబాబు వ్యాఖ్యానించారని విమర్శించారు.

జనసేన ఆధ్వర్యంలో మొక్కలు పంపిణీ

ప్రజాశక్తి - పోడూరు

వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు జనసేన పార్టీ అధ్వర్యంలో మండలంలోని గుమ్మలూరు గ్రామంలో ఏర్పాటు చేసిన మజ్జిగ చలివేంద్రం ఆదివారంతో 50 రోజులు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా జనసేన పార్టీ జిల్లా సంయుక్త కార్యదర్శి రావి హరీష్ బాబు అధ్వర్యంలో మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జనసేన పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు వెంగల దాసు పాల్గొని మాట్లాడుతూ ఈ వేసవి కాలంలో ప్రయాణికుల దాహార్తి తీర్చేందుకు జనసేన పార్టీ అధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం దాతల సహకారంతో కొనసాగించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్రటరీ చిట్టురి శ్రీనివాస్, తోట ఆదినారాయణ, నిమ్మన శేఖర్, కడిమి ఉమా మహేశ్వరరావు, పితాని లక్ష్మణ్, దార్లంక సుబ్బారావు, విజయ్, రామకృష్ణ పాల్గొన్నారు.

నేడు వేంద్రలో 'గడపగడపకూ..'

ప్రజాశక్తి - పాలకోడేరు

మండల పరిధిలోని వేంద్ర గ్రామంలో సోమవారం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు మండల పరిషత్ అధ్యక్షులు భూపతి రాజు సత్యనారాయణ రాజు (చంటిరాజు) ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. గ్రామంలో నాలుగో రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి డిసిసిబి ఛైర్మన్, వైసిపి ఉండి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పివిఎల్.నరసింహరాజు ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని తెలిపారు. గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి నాలుగేళ్ల కాలంలో ప్రభుత్వ అందించిన సంక్షేమం, చేసిన అభివృద్ధిని వారికి వివరించి సంక్షేమ బ్రోచర్‌ను అందించనున్నామని తెలిపారు. మండలంలో ఉన్న వైసిపి నేతలు, నాయకులు, కార్యకర్తలు అభిమానులు ఈ కార్యక్రమానికి తరలిరావాలని కోరారు.



ఆలయంలో యాత్రికుల రద్దీ

బండి ముత్యాలమ్మ ఆలయం కిటకిట

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లి గ్రామంలో ఉన్న బండి ముత్యాలమ్మ ఆలయం ఆదివారం యాత్రికులతో కిటకిటలాడింది. యాత్రికులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. కానుకలు, మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ కార్య నిర్వహణ అధికారి రామకృష్ణంరాజు, ఛైర్మన్ కొల్లాటి రామారావు పర్యవేక్షణలో ఆలయ సిబ్బంది పాలకవర్గ సభ్యులు యాత్రికులకు ఎటువంటి సౌకర్యాలు కలగకుండా ఏర్పాట్లు చేశారు. ప్రసాదం వితరణ సేవా కార్యక్రమాలు నిర్వహించారు.

నేడు హుండీ లెక్కింపు

ప్రజాశక్తి - మొగల్తూరు

మండలంలోని ముత్యాలపల్లిలో ఉన్న బండి ముత్యాలమ్మ హుండీ ఆదాయాన్ని సోమవారం లెక్కించనున్నామని ఆలయ కార్యనిర్వాహణాధికారి దెందుకూరి రామకృష్ణంరాజు తెలిపారు. ఈ లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనేవారు ఉదయం ఎనిమిది గంటలకు ఆలయ ప్రాంగణానికి చేరుకోవాలన్నారు.